# నక్షత్రమండలము

గొబ్బూరి వేంకటానందరాఘవరావుగారు

(ఆశ్వయుజమాసము)

ఈమాసముపేరు ఆశ్వయుజమాసము. దీనికీ పేరువచ్చుటకు కారణమేమనగా, ఈనెల పున్నమనాడు చంద్రుడు అశ్వినీనక్షత్రముచెంతనుండును. రాబోవునెలలో పున్నమనాడు చంద్రుడు కృత్తికనక్షత్రములచెంత కానబడును. కనుక నామాసము కార్తికమాసమని చెప్పుచున్నాము. ఇట్లే ఆయామాసములందు పున్నమ





౧. నక్షత్రమండలము. ఆశ్వయుజమాసము

9 10- 17 ౬-౨౫

నాడు చంద్రు డేనక్షత్రముచెంత నగపడునో ఆ నక్షత్రమునుబట్టి ఆయామాసముల నామము లేర్పడినట్లు తెలిసికొనగలము.


సూర్యాస్తమాన మైనతరువాత ఈ మాసములో రాత్రి తొలిజామున మన కగపడు ముఖ్యనక్షత్రములను గూర్చి యీవ్యాసమున ప్రశంసింతము. ఆయా నక్షత్రములను ఎట్లు గుఱుతింపవలెనో తెలిసికొనుటకు ప్రయత్నింతము.

అశ్వినియని వ్యవహరింపబడెడు నక్షత్రముల గుంపులో కాంతివంతమైనవి ముఖ్యముగా మూడు చుక్కలు కలవు. మన జ్యోతిశ్శాస్త్రవేత్తలు 'అశ్వముఖా అశ్వినీత్రిణి' అనియు, 'తురగముఖా అశ్వినీత్రిణి' అనియు వర్ణించి వీటిని గుఱుతించుటకు మార్గము తెలిపినారు. వీటి యాకారము ఈదిగువను చూపబడినట్లుండును.—




౨. అశ్వినిచిత్రము


ఈమూడు చుక్కలను చూచినంతమాత్రముచేత అశ్వముఖము మనకు స్ఫురింపదు. కాని వీటి సమీపమందున్నట్టియు, వీటి యంత స్ఫుటముగా నగపడక, కాంతి సంపదయందు చాల తక్కువగా నున్నట్లగపడునట్టియు మఱికొన్ని చుక్కలను గూడ గమనించితిమేని మనజ్యోతిశ్శాస్త్రవేత్తలు వర్ణించిన తురగముఖాకారము స్ఫురింపగలదు. చూడుడు: ప్రక్కనున్న 3 చిత్రము. ఈసుంపులో ముఖ్యమైనవి మనము ౧, ౨, 3 సంజ్ఞలచే గుర్తించినవి. ఇందు ౧-వది మిహిరనక్షత్రమని శ్రీ కేతక్కరుపండితులు తమ జ్యోతిర్గణితమునందలి నక్షత్రపటమున తెల్పియున్నారు.




3. అశ్విని నక్షత్రములు. గుఱ్ఱపు బుఱ్ఱ ఆకారము.

౨-వది 'దస్ర' నక్షత్రమనియు, 3-వది 'నాసత్య' మనియు తెలియుచున్నది. ఈ దస్ర నాసత్యులే అశ్వినులని ఋగ్వేదము తెలుపుచున్నది.

ఇవి మేషరాశిలోని నక్షత్రములలో మిక్కిలి తేజోవంతములైనవి. కనుక వీటిని గ్రీకుభాషలోని మొదటి మూడక్షరములతో గుర్తించి చెప్పుదురు. మిహిర నక్షత్రము పాశ్చాత్యశాస్త్రజ్ఞుల ఆల్ఫా ఏరీస్. దీనికే హమల్ (Hamal) అని నామాంతరమున్నది. దస్రనక్షత్రము బీటా ఏరీస్. దీనికి నామాంతరము షెరటన్ (Sheratan). నాసత్యనక్షత్రమునకు గామా ఏరీస్ అని గురుతు. దీనికి నామాంతరము మెసర్టిమ్ (Mesartim). ఈనక్షత్రముల కధి దేవతలు అశ్వినులు. ఈ అశ్విని నక్షత్రములకు కొంచెము మూలగా 3-౨ నక్షత్రములు—చిన్నవిగా కనపడునవి—కలవు. ఈ చుక్కలగుంపు రేవతి. రేవతిపడమరగా మంచముకోళ్లవలె చతురస్రాకారముగల నాలుగు నక్షత్రము లున్నవి. ఇందులో రేవతిసమీపమున నున్న రెండును ఉత్తరాభాద్ర. వాటికి పడమటగా రెండును పూర్వాభాద్ర. పాశ్చాత్యులీనాల్గింటిని కలిపి పెగసస్‌చతురస్ర (Square of Pegasus) మని వ్యవహరింతురు. గ్రీకుపురాణగాథలలో పెగసస్ అనునది యొక గుఱ్ఱమని వర్ణింపబడినది. బల్లెరోఫోన్ (Bellerophon) అనుయోధు డాగుఱ్ఱముపై స్వారిచేసెడివాడట. కాని అంతకంటె కడుప్రాచీనమైన ఋగ్వేదసంహితలో • పేదు అను



౮. పెగసస్ (Pegasus) చిత్రము

రాజర్షి కి అశ్వినీదేవతలు ఒకానొక అఘాశ్వము నిచ్చి నట్లు ఋగ్వేద ప్రథమ మండలములో నిట్లు వర్ణింప బడినది.—

—I. 116-6

"య మశ్వినా దదథుః శ్వేత మశ్వ మఘాశ్వాయ శశ్వదిత్స్వస్తి, తద్వాందాత్రం మహికీర్తేన్యం భూత్వై దోవ్సద మిద్వోవ్యర్యః."
—I. 116-6

పురూవర్పాం స్యశ్వినా దధానా నిపేదవ ...
I. 117-9

యువం శ్వేతం పేదవఽఇంద్రజూత మహిహన మశ్వినాదత్త మశ్వం. I. 118.9.

ఈ యశ్వ 'మహిహానమ్' దుష్టసర్పములను హరిం చునది యని కూడ వర్ణింపబడినది. భాద్రపద నక్షత్రము లుదయమగుసరికి సర్పాకారముగల హైడ్రా (Hydra) అను చుక్కలగుంపు అస్తమించుట ఇచట గమనింపవల యును. ఖగోళమున ౧౮౦ అంశలు దూర ముసందున్న నక్షత్రములును, రాసులును సరిగా ఎదుట (diametrically opposite) నుండుటను ప్రతిస్పర్థులు. ఒకటి ఉదయమైనపుడు ప్రతిస్పర్థి యస్తమిం చును. అందుచేతనే పేద్వఘాశ్వము అహిహానమని వర్ణింపబడినది. ఋగ్వేద మునందలి పేద్వఘాశ్వము గ్రీకుపురాణగాథ లలో పెగసస్‌గా మారినది. దుష్టరాక్షస వధార్థము బెల్లెరోఫోన్‌కు వాహన మైనది. ఇట్టి వెన్నియేని కలవు.

ఇందున్న నాల్గు నక్షత్రములకు పాశ్చాత్యసంజ్ఞలు, నామములును:—

ఆల్ఫా పెగసస్=ఆల్ఫాఆంద్రమీడ=ఆల్ ఫెరాట్జ్.

| | | | |
|---|---|---|---|
| బీటా | ,, | స్కీట్ | } పూర్వాభాద్ర. |
| గామా | ,, | ఆల్ జెనిబ్ | |

కొందరి మతముచేత ఆల్ఫా ఆంద్రమీడ 'మార్కబ్'. ఈతగువు ఉత్తరాభాద్ర నక్షత్రములో ఈశాన్యదిశనున్న నక్షత్రము ఈ రెండు గుంపులకు సామాన్యముగానుండుటచేత కలిగినది. ఇట్టి చీకాకు వృషభరాశిలోకూడ కలదు. అవి వెనుకనుండి చూతము.

పూర్వాభాద్రకు పశ్చిమముగా మద్దెలవంటి యా కారముగల చిన్ని నక్షత్రము లెనిమిది యున్నవి. ఇవియే ధనిష్ఠ. వేదములో శ్రవిష్ఠయనిపేరున్నది. దీని కధిదేవ తలు వసువులు. భీష్ముడీవసువులలో నొకడు. ధనిష్ఠకు దిగువను పడమటగా శ్రవణ మున్నది.


శ్రవణమునందు మూడునక్షత్రము లున్నవి. అందు మధ్యనక్షత్రము చాల తేజోవంతమయినది *. ఈ శ్రవణ మును పాశ్చాత్యులు గరుత్మంతుని రాశి(Aquila)లో

---

* శ్రీనాథకవి కాశీఖండములో శ్రవణము నిట్లు వర్ణించినాడు—

సీ. "శయనించె నొకచోట శ్రవణ నక్షత్రంబు గుంటి మీదటి ప్రత్తికొడుకు వోలె."
అనగా గుడ్డిమీదనున్న ప్రత్తిచేనిలో కాయ పేలినపుడు వెలువడు ప్రత్తికొడుకువలె ధవళధవళమైన నక్షత్రము లతో శ్రవణము పండుకొనినట్లున్నదని వర్ణన.

చేర్చినారు. శ్రవణము చుట్టునున్న మఱికొన్ని నక్షత్రములను చేర్చినయెడల గరుత్మంతుని యాకారము





౫. గరుడ (Aquila) చిత్రము

[౧. అల్ఫా ఏక్విలా=Al tair
౨. బీటా ,, =Al shain } శ్రవణము.
3. గామా ,, = Trazed

అల్టేర్-అల్ షెయిన్, ట్రాజడ్-అను మూడును చేరి శ్రవణ మని కొందరి మతము. ఒక్క అల్ టేర్ శ్రవణమని మరికొందరందురు.]

స్ఫురింపగలదు. దేవదేవుని సన్నిధానమున నీ గరుత్మంతు డున్నాడని గ్రీకుపురాణగాథలు తెలుపుచున్నవి. మనదేవతలలో నీతడు శ్రీ మహావిష్ణుని వాహనము, ధ్వజముకూడ నయి యున్నాడు. శ్రవణమున కావల పశ్చిమముగా నస్తమితుడగుచున్న శేషశాయి శ్రీ మహావిష్ణు వున్నాడు. యాదవకుల చూడామణియై యవతరించిన యీ కృష్ణుడే 'హరి, కులేశు' డని వ్యవహరింపబడెను. ఈ హరి కులేశునే గ్రీకుపురాణగాథలు హెర్క్యులీస్ (Hercules) అని వర్ణించుకొనినట్లు స్ఫురించుచున్నది. భాద్రపద శుద్ధ ఏకాదశినుండి పరివర్తనలోనుండి యస్తమితుడు కాబోవుచున్న యీ మహావిష్ణుని రూపవిశేషాదులను గూర్చి సావధానముగా వేరొకప్పుడు-బాగుగా ఉదయమయినపుడు-వర్ణించుకొందము. ఈ మహావిష్ణువుయొక్క నాభికమలమునుండి బ్రహ్మ జననమొందినట్లును, బ్రహ్మ ముఖమునందు వీణాధారిణియైన సరస్వతియున్నట్లును మన పురాణములు తెలుపుచున్నవి. పాశ్చాత్యు లీ మండలమును వీణా(Lyra) మండలమని వ్యవహరింతురు. ఈమండలములో నెల్ల కాంతివంతమయినది బ్రహ్మనక్షత్రము. దీనినే పాశ్చాత్యులు వేగా(Vega) నక్షత్రమందురు. కాలుచున్న మెగ్నీశియము తీగవలె తెల్లనికాంతితో నిది ప్రకాశించుచుండును.

ఈ వాణీ హిరణ్యగర్భులకు వాహనమైన రాజహంస ఆప్రక్కనే కలదు. దీనినే పాశ్చాత్యులు సిగ్నస్ (Cygnus) అని చెప్పుదురు. ఇందు శిలువ (Cross) ఆకారముగల నక్షత్రము లారేడు కలవు. ఈ సమీపమునందలి చిన్న నక్షత్రములనుకూడ గమనించినయెడల రాజహంస ఆకారము చక్కగా స్ఫురింపగలదు.





౬. రాజహంస చిత్రము

[౧. ఆల్ఫాసిగ్నస్=Arided ఆరిడెడ్.
౨. బీటా. ,, =Albireo ఆల్బిరియో.
౩. గామా.
౪. డెల్టా.
౫. ఎప్సిలాన్.
(౩–౫: ప్రత్యేకనామములు లేవు.)

౬. ఈచుక్క ౧౮౭౬ లో ఆకస్మికముగా కనబడి కొంతకాలముండి మాయమయినది. ఇప్పుడు కనబడదు.]

ఈ రాజహంసకు ఉత్తరదిశను భయంకర సర్పాకారము గల నక్షత్రసమూహమున్నది. పాశ్చాత్యులు దానిని డ్రేకో (Draco) అను లాటిను (Latin) నామముతో వ్యవహరింతురు. యోగనిద్రాపరాయణుడగు శ్రీమన్నారాయణునికిని భూదేవికిని భయంకరుడగు నరకుడు జనించెనని మన పురాణములు తెలుపుచున్నవి. జగద్భయంకరుడగు నారాకసుని శ్రీకృష్ణుడు సంహరించెనని కలదు. ధరగన్నవాడు, ధరాసూనుడు నని మనవారు చెప్పిన నరకుడే యీ Draco లేక Dragon అని నా మనవి. ఇపుడు నక్షత్రపటములో నామావశిష్టుడై చచ్చిన నరకుని చూడగలము. కాని ఐదువేలసంవత్సరముల క్రిందట ఉత్తరఖగోళములో సగమువఱకు నాక్రమించుకొని, సప్తఋషి ప్రముఖ సమస్త తారామండలములను పీడించుకొని తినుచుండిన నరకుని తేజః క్రౌర్యములు ఈప్రక్కనున్న పటములో చూడనగును. ఇందలి వివిధ నక్షత్రనామములు, వివరములును సావకాశముగా మరియొకమారు చూచుకొందము.




౭. Draco చిత్రము

డ్రేకోమండలమున కుత్తరముగా లఘుఋక్షమున్నది. ఋక్షమనగా ప్రకాశించునదియని యొకయర్థము. ఎలుగుగొడ్డని రెండవయర్థము. ఖగోళమునందు మనకు రెండు ఎలుగుగొడ్డు రూపములున్నవి. ఒకటిబృహదృక్షము. సప్తమహాఋషులీమండలములోనివారు. ఈ మాసములలో రాత్రి తొలిజామున వారలగపడరు. మరీచి, వశిష్ఠాంగీరసులు మాత్రము వాయవ్యదిశను స్వల్పముగా నగపడుదురు. Bootes అని పాశ్చాత్యులు చెప్పెడి భూతేశమండలములోని కొన్ని చుక్కలుకూడ పశ్చిమదిశను స్వల్పముగా గోచరించును.

లఘుఋక్షమునందలి యీ దిగువనక్షత్రములకు ఉదయాస్తమానములు లేవు [నాస్తమేతి నచోదయమ్]. ఈలఘుఋక్షమునందలి నక్షత్రములన్నిటిలో దానిపుచ్ఛాగ్రమునందున్నట్లు కనబడెడి ధ్రువుడు ముఖ్యుడు. పుచ్ఛమునందు ధ్రువునికి దక్షిణముగా కశ్యపుడును, కశ్యపునికి దిగువ మహేంద్రుడును, పుచ్ఛమూలమున నగ్నియు నున్నారు. అగ్నికి దిగువ మిత్రుడున్నాడు. అగ్నికి పశ్చిమమున ధాతయు, మిత్రునికి పశ్చిమమున విధాతయు నున్నారు. ఇందుకు ప్రమాణములు వలయునేని యజురారణ్యకమునందలి ధ్రువోపస్థాన మంత్రమును [కృష్ణయజురారణ్యకము, ద్వితీయ ప్రపాఠము, 19 అనువాకము] వాయు మత్స్య శ్రీ భాగవత పురాణములను చూడనగును.†

† విశాఖపట్టణ కవితాసమితివారి మధ్య ప్రచురించిన 'వైశాఖి' సంచికలో నా 'నక్షత్రముల' వ్యాసము 72 పుటలో ప్రమాణములిచ్చినాను.

అశ్వినీ, రేవతీనక్షత్రములకు దిగువను ఒక పెద్ద జలచరాకారముగల నక్షత్రసముదయ మున్నది. దీనికి పాశ్చాత్యులు సీటస్ (Cetus) అను పేరు పెట్టినారు.



౮. Cetus చిత్రము (శింశుమారము?)

ఖగోళచిత్ర* మను సిద్ధాంత గ్రంథమును నక్షత్ర పటములను రచించిన శ్రీ కాళీనాథ ముఖర్జీగారు దీనిని తిమిమణ్డలమని వ్యవహరించినారు.

ఈనక్షత్రములను తిమిమణ్డలమనుటకు కారణము విష్ణుపురాణము V. 27-4లో "పతితం తత్రచ ఏవఏకః మత్స్యః జగ్రాహవాలకమ్" అని యుండుటయే. కాని వీరు ఋగ్వేదములో దీని ప్రశంస గమనింపరైరి. ఋగ్వేదము I. 116-18 లో నిది శింశుమారమని వర్ణింపబడినది. అశ్వినీదేవతలు వృషభశింశుమార యుక్తమైన రథమెక్కి భరద్వాజునింటికి వచ్చిరట! వృషభరాశి కార్తిక మాసములో రాత్రి తొలిజామున నుదయించును. కావున రాబోవు నక్షత్రపటములో వృషభరాశిని చూపి యీ ఋక్కును మరల చర్చింతము. శింశుమారమనునది యొక జాతి మొసలియని చెప్పుదురు. ఆ జాతి యిపుడు నశించినది. ప్రాచీనపటములలో దీని స్వరూప మిట్లు ప్రకటచూపబడినది.


ఈ తిమిమణ్డలమునకు పశ్చిమముగాను ధనిష్ఠకు దిగువను కుంభరాశి యున్నది. ఇచట కుంభ మనగా జలకుంభము. జలాధిపతియైన వరుణుడు జలకుంభమును బోర్లించి జల మొసంగుచున్నట్లు ఋగ్వేదములో వరుణసంబంధమైన చక్కని ఋక్కులున్నవి. చూడుడు— "నీచీనబారం వరుణః కవంధం ప్రససర్జరోదసీ అంతరిక్షం, తేన విశ్వస్య భువనస్య రాజాయవం నవృష్టి ర్వ్యనత్తి భూమ." V. 85-3


క్రిందకు ముఖముగల పెద్ద కుంభమునుండి జలముభూమిమీదను, రోదసీ, అంతరిక్షములందును పడునట్లుచేసి అందువల్ల విశ్వప్రభుడగు వరుణుడు, వర్ష జలము యవలను తడుపునట్లు భూమికి జల మిచ్చుచున్నాడు. ఈ వర్ణనకనురూపముగానే ప్రాచీన నక్షత్రపటములలోవరుణుని బొమ్మ కనబడుచున్నది. (చూడుడు : చిత్రము ౯.)

## ఇంద్రద్యుమ్నుడు

కుంభరాశికి దిగువను పాశ్చాత్యులచే 'ఫోమలో' (Fomalhant) యని పిలువబడెడి మిక్కిలి తేజోవంతమైన నక్షత్రరాజ మున్నది. నేనెఱిగినంతవఱకు మనవా రెవ్వరును దీనికి ప్రత్యేకము పేరు పెట్టలేదు. దీని నింద్రద్యుమ్నుడని పిలువవచ్చునని నా మనవి. కారణము లీదిగువను మనవిచేయుచున్నాను. ఇంద్రద్యుమ్నుని గూర్చిన రెండుకథలు భారతభాగవతములందు తెల్పబడినవి.

* ఈ ఖగోళచిత్రమను గ్రంథము 1901 సంవత్సరములో (Thacker Spink & Co.) థేకరుస్పింకుకంపెని వారివలన ప్రకటింపబడినది.





౮. రాశిచక్రము. ఎడమచేతిపైపున వరుణుని చిత్రము గననగును.

అందు మొదటిది:—

1. భారతము. అరణ్యపర్వము. 4-363 to 374 ఇంద్రద్యుమ్న చరిత్రము కలదు. ఇంద్రద్యుమ్నుడను రాజు దేవలోకములో బహుకాలముండిన తరువాత నతనికీర్తి భూలోకములో మాసిపోయెను. 'నీకీర్తి మాసిపోయినది. నీవు దేవలోకములో నిక నుండతగ'వని దేవతలు అతనిని భూమిమీదకు త్రోచివైచిరి. ఇంద్రద్యుమ్నుడు మార్కండేయునికడ కరిగి "పుణ్యాత్మా! నన్నెఱుగుదువా?" అని యడిగెను. మార్కండేయుడును "నేనెఱుగను. నాకంటె వృద్ధు హిమవత్పర్వత శృంగమున ప్రావారకర్ణుడను ఘూకమున్నది. అది నిన్నెఱుగునేమో. పోయి కనుగొను" మనెను. ఇంద్రద్యుమ్నుడు మార్కండేయుని కూడ తీసుకొని, ఆఘూకముకడకు పోయి "నన్నెఱుగుదువా?" అని ప్రశ్నించెను. "నిజముగా నిన్ను నేనెఱుగను; నాకంటె పెద్దది నాళీకజంఘమని యొకకొంగ గలదు. అది ఇంద్రద్యుమ్నమను కొలనిలో నివసించుచుండును. దానికడ కరిగి తెలిసికొమ్మ" అని యా ఘూకము ప్రత్యుత్తరమిచ్చెను. ఇంద్రద్యుమ్నుడు మార్కండేయుని, ఉలూకమును మోచికొని "నాళీకజంఘు నొద్దకుం జని తన పేరుసెప్పి 'నన్నెఱుంగుదే' యనిన నదియు "నిన్నెఱుంగజాల. నాకంటె జిరకాల జీవియైన యుగంధరుండను కచ్ఛపంబు గల దదియును నికొలననుండు నజ్జలచరము నిన్నెఱుంగజాలు నడిగి చూతముగాక" యని యక్కమఠంబు బేర్కొని "యిదియొక్క సందేహంబు నిర్ణయించుటకయి యార్యజనంబులు నిన్ను గుఱించి వచ్చినవారు నీవు సనుదేరవలయు" నని వేడుటయును,

గీ॥ కొలనువెలువడి చనుదెంచె గూర్మవిభుడు
వార లడిగి రింద్రద్యుమ్న ధారుణీశు
నెఱుగుదే యన నదియు నొక్కింతసేపు
దలచుకొని కన్నుగవ నశ్రుతతులు దొరుగ.

వ. ఎలుంగురాల్పడ వారలం గనుంగొని యిట్లనె.

ఉ. అక్కట నేనెఱుంగనె మహా
గుణభూషణు నమ్మహాత్ము న
నిక్కడ బెక్కుమాఱులు న
నేకభయంబుల బొందకుండగా
నక్కటికంబుతోడ దగ నా
తడు గైకొని కాచెగాదె పెం
పెక్కిన యన్నరేశ్వరుని నె
న్నటికిన్ మఱువంగవచ్చునే.

గీ. అమ్మహాత్ముండు బహువిధ యజ్ఞ దక్షి
ణార్థముగ విప్రవరులకు నర్థినిచ్చు
గోగణంబుల గొరిజల గ్రొస్సియయ్యె
గాదె యీ సరోవరము జగన్నుతముగ.

అనిన యనంతరంబ దేవదూతలు విమానంబు గైకొని చనుదెంచి యింద్రద్యుమ్నుని గని "మహాత్మ, నీకీర్తి జగంబునందు శాశ్వతంబై నిలిచె. నీకు త్రిదివ నివాసంబు సుస్థిరంబయ్యె నరుగుదెమ్ము..."అనిరి.

ఇంద్రద్యుమ్నుడీ బక కచ్ఛప ఘూకములతో మార్కండేయున కనతిదూరమున నక్షత్రమండలమున కానబడుచున్నాడు. మూల పూర్వాషాఢా నక్షత్రముల మధ్య మృకండు డున్నట్లు కేతాకరు పండితులు తమ జ్యోతిర్గణితమునందలి నక్షత్రపటములో నిరూపించినారు. మృకండసుతుడగు మార్కండేయుడా ప్రక్కనే కలడు.

ఘూకమనగా గ్రుడ్లగూబ. ఇట్టి పక్షిరూపము దక్షిణాకాశమున నున్నట్లు ప్రాచీన నక్షత్రపటములలో స్పష్టముగా కలదు. A. B. Grimoldi దొరగారు 1905 సంవత్సరములో " A Catalogue of Zodiacs and Plainspheres, Originals and Copies, Ancient and Modern, Extant and Non-Extant, From B. C. 1320 to A. D. 1900. Arranged in Chronological order according to Countries" అను చక్కని గ్రంథమును ప్రకటించినారు. ఇందు క్రీ. పూ. 1320 సం. మొదలు క్రీ. శ. 1900 వఱకుగల కాలములో సమస్తదేశములలోను, ప్రాచీనములు, నవీనములు నైన ఖగోళరాసులు, నక్షత్రరూపములు గల శిల్పములు, చిత్రములు, మాతృకలు, ప్రతికలు, ఉన్నవి, నశించినవి, తెలియవచ్చిన వన్నియు నొక పట్టిక తయారుచేసి వివరములతో గ్రంథరూపమున ప్రకటించినారు. ఇది Gall and Ingles కంపెనీవారిచే ప్రకటింపబడినది. ఇందు ప్రాచీన ఖగోళ శిల్ప, చిత్రములలో ఘూకరూపమున్నట్లు 61-వ పుటలో వర్ణింపబడిన 428 సంఖ్యగల రోమక శిల్ప చిత్రమున్నది. ఈ ఘూకరూపమును పాశ్చాత్యులు ఫేనిక్సు(Phoenix)అందురు. ఇది మనభారతమందలి ప్రావారకర్ణఘూకమే నని నా మనవి.ఆప్రక్కనున్న బకరూపమును పాశ్చాత్యులు Grus అని చెప్పుదురు. Grus అనగా కొంగ ( Crane) అని అర్థము. ఈ బకరూపము గ్రిమాల్డిదొరగారి పుస్తకమునందలి 31-వ పుటలో చీనాఖగోళచిత్రములలో 146-వ సంఖ్యగల వివరములో నున్నది. మఱియు 92-వ పుటలో 733-వ సంఖ్యగల ఇటాలియను శిల్పమునందును బక, ఘూక రూపములు 2ను చిత్రింపబడినట్లును చెప్పబడినది. కూర్మరూపము ఆ గ్రంథమునందలి 14, 28, 61, 67, 80 పుటలలో వర్ణింపబడినది. ఇందు 14-వ పుటలోనిది అస్సీరియను శిల్పము. 28-వ పుటలోనిది పారశీకశిల్పము. 61-వ పుటలోనిది రోమకశిల్పము. 67-వ పుటలోనిది మిత్రవిషయిక (Mithraic) శిల్పము. 80-వ పుటలోనిది కూడ మిత్రవిషయికమే. మఱియు నాగ్రంథమునందలి 143-వ పుటలో 1179-వ సంఖ్యగా వివరింపబడిన తామ్రశాసన మున్నది. భాష సంస్కృతము. సింహాది రాసులు చిత్రింపబడినవి. అందొక యేనుగురూపమును కలదు.

ఈసందర్భములను పట్టిమాడగా మన భారతమునందలి ప్రాచీనగాథలు చరిత్రాత్మకములగుటయే గాక జ్యోతిశ్శాస్త్రవిజ్ఞానమునకు కూడ ప్రబలసాధనములని గ్రహింపవలసి యుండును.

ఇంద్రద్యుమ్నునిగూర్చిన రెండవకథ మన గజేంద్రమోక్షము. ఇంద్రద్యుమ్నమహారాజు తపస్సుచేసుకొను

చుండగా నగస్త్యమహాఋషి రాగా రాజు లేచి పూజింపలేదు. అందుకు ఋషి చాల కోపించి ఏనుగవై పుట్టుమని శాపమిచ్చెను. అతడేనుగయై త్రికూట పర్వతపు టడవిలో సంచరించుచుండెను. ఒకనాడు మిక్కిలి దాహమువేయగా గజేంద్రుడొక సరస్సునకు బోయి మంచినీళ్లు త్రాగుచుండగా ఆసరస్సునందున్న ఘోర మకరి యొకటి యీ యిభరాజు నోడిసి పట్టెను. కరిమకరములకు వేయిసంవత్సరములు పోరాటము జరిగెను. తుదకు గజేంద్రుడు విష్ణుని ప్రార్థింపగా చక్రప్రయోగముచేత విష్ణుడా మకరితల ద్రుంచెను. మకరము రవి జొచ్చెను. ఇంద్రద్యుమ్నుడు శాపవిముక్తుడై విష్ణురూపుడగుచు వెలుగుచున్నాడు.

ఇందలి ఖగోళార్థము గమనింపుడు. అగస్త్యుడు వచ్చుసరికి, అనగా అగస్త్యనక్షత్రము (Canopus) ఉదయమగుసరికి ఇంద్రద్యుమ్నుడు లేవలేదు. ఇంద్రద్యుమ్నుడు ఆ కారణముచేత ఏనుగ కావలెనని శపింపబడెను. ఏనుగకు సింహమునకు స్పర్ధ. సింహరాశి కెదుట ఏనుగరూపముతో నుండుమని శాపము. ఎక్కడ ఈ ఏనుగు ఉండవలసినది? త్రికూటపర్వతము క్రింది అడవిలో. ఆ పర్వతముమీద నెవరున్నారు? తెనుగుభాగవతములో ఆ సంగతి లేదు. కాని సంస్కృత మూలమునందు "తస్యద్రోణ్యాంభగవతో వరుణస్యమహాత్మనః" అని స్పష్టముగానున్నది. త్రికూట పర్వత సానువునందు వరుణు డున్నాడు. ఆ క్రిందనే (అతని వాహనమైన) మొసలియున్నది. ఆసమీపమునందే ఒకప్పుడు ఏనుగు రూపముననున్న ఇంద్రద్యుమ్నుడున్నాడు. ఈ మకరమీ యేనుగను పీడింపగా విష్ణుచక్రము మొసలిని సంహరించినది. మకరము సూర్యునియందు ప్రవేశించినది— అనగా మకరమాస మారంభమయినది. ఇంద్రద్యుమ్నుడు విష్ణురూపుడై వెలుగుచున్నాడు.

నౌకాయానము చేయువారికి ఇంద్రద్యుమ్న నక్షత్రము చాలా ప్రయోజనకారి. ఈ నక్షత్రస్థానమును గమనించి కొన్ని లెక్కలు కట్టుకొనిన పక్షమున నౌక ఎప్పు డెచ్చట,నున్నది మిగుల సులభముగా తెలియగలదు.

ఇక మన నక్షత్రపటములో నైఋతి భాగమున నున్న నక్షత్రములను గుఱించి యోజింతము. ఇప్పటికి తులారాశి యస్తమించుచున్నది. అనగా కుమ్మరి సారెవలె గుండ్రముగా ఐదునక్షత్రములుగల విశాలనక్షత్రము అస్తమించుచున్నది. దానికి దిగువను గొడుగువంటి ఆకారముగల మూడునక్షత్రములతో కూడిన అనూరాధ నక్షత్రము కలదు. అనూరాధకు తూర్పుగా నట్టి యాకారమే గల మరి మూడు నక్షత్రము లున్నవి. అవియే యోగతార జ్యేష్ఠ. ఆమధ్యనున్న ఎఱ్ఱని నక్షత్రమును పాశ్చాత్యులు ఎంటారిస్ (Antares) అని చెప్పుదురు. వృశ్చికరాశిలోని నక్షత్రములన్నిటిలో నిదే మిక్కిలి తేజోవంతమయినదికనుక దీనిని ఆల్ఫాస్కార్పియో (Alpha Scorpio) అని చెప్పుదురు. జ్యేష్ఠకు దిగువను, చిన్నవియు పెద్దవియు, ముడిచినతోకవలె వంకరైనవి పదునొకండు నక్షత్రము లున్నవి. ఇదే మూలనక్షత్రము. అనూరాధ, జ్యేష్ఠ, మూల నక్షత్రములు చేర్చిచూచిన పక్షమున ఆకాశమునందు తేలువంటి ఆకారము మనకు గోచరించును. ఈ తేలురూపమునకు 'మూల' తోకగాను, జ్యేష్ఠ, అనూరాధ నక్షత్రములు శరీరము డెక్కలు గాను కనబడును.

ఈ చుక్కలకు తూర్పుగా 'ధనుస్సు' అనబడు రాశి కలదు. ఈ ధన్వియే మన పురాణములలో మన్మథుడని వర్ణింపబడినాడు. మన్మథుడు మకరధ్వజుడు. 'ధనస్సు'రాశికి పైది మకరమగుటచేత మన్మథునికి మకరము 'ధ్వజము' అని చెప్పుట సహజము. ఈ మకరమే వరుణుని వాహనముగను, గజేంద్రుని పీడించిన మొసలిగను మన పురాణములందు వర్ణింపబడెనని పైని చూచియున్నాము. మన్మథు డీశ్వరునికి ప్రతిస్పర్థి. అనగా ఈశ్వరునికి సరిగా ఎదురుగా (Diametrically opposite) నుండును. ఈ మన్మథ మహేశ్వరులను గూర్చి ముందు సంచికలలో విపులముగా చూతము.

ఈనెలలో గ్రహములలో శనియొక్కటే మనకు రాత్రి తొలిజాముననే కనబడును. గురు శుక్రాది గ్రహములు సూర్యోదయాత్పూర్వము కనబడునుగాని సాయం

కాలము ఇపుడు కనబడరు. సూర్యకుటుంబ మంతటిలో నద్భుతరూప ప్రకాశములుగల శనిగ్రహమును గూర్చి ముందు వివరములు తెలిసికొందము. ఈపటమునందు అది ఎఱ్ఱనిచుక్కగా చూపబడినది. ఆ సమీపమునందే మృకండుడును, అతనిపుత్రుడగు మార్కండేయుడును చూపబడినారు.

ఇక మన పటముయొక్క ఈశాన్యదిశ నున్న చుక్కల గుంపులను గూర్చి యోజింపవలసి యున్నది. తూర్పునుండి పశ్చిమమునకు బోవుచుంటిమేని, పాశ్చాత్యులు వీటిని క్రమముగా Perseus, Andromeda, Cassiopea's Chair, Cephens అను నామములతో వ్యవహరింతురు. మేషమునకును Andromeda కును మధ్య Triangulum అనబడు మూడు చుక్క లున్నవి.

ఈ గుంపులకు మనవా రేమైన పేళ్లుపెట్టినారా లేదా అని చూడవలసియున్నది.

Richard A. Proctor రిచర్డు, ఎ. ప్రాక్టరను పాశ్చాత్య సిద్ధాంతవేత్త Myths and Marvels of Astronomy అనగా "ఖగోళశాస్త్రము, అందలి గాథలు మహాద్భుత విశేషములు" నను నొక గ్రంథ మాంగ్లభాషలో రచించెను. అందలి 335 పుటలో నత డొక వృత్తాంతమును వ్రాసినాడు. ఆ వృత్తాంతమిది:— విల్ఫోర్డు (Wilford) అను పండితు డొకప్పుడు హిందూదేశములోని యొక సిద్ధాంతశాస్త్రవేత్తను పిలిపించి "అంతర్మద" అను నక్షత్రసమూహ మెక్కడిదని యడిగెనట! హిందూసిద్ధాంతి తత్క్షణమే పై ఏంద్రామిడా (Andromeda) చుక్కలను చూపించెనట! విశేషించి ఆ సిద్ధాంతి యొక ప్రాచీన సంస్కృత గ్రంథమును ఆ దొరగారికి చూపెనట! ఆ గ్రంథము Very rare and curios work అనగా 'దుష్ప్రాప్యము విచిత్రమునైన గ్రంథ' మని యాదొరగారు Asiatic Researches అను పత్రికలో వ్రాసినారు. ఆసంస్కృతగ్రంథములో ఉపనక్షత్రములనుగూర్చి యొక ప్రకరణముండెనట! అందు Cephens అనగా కఫూజ యనియు Casseopea అనగా కశ్యపి అనియు, Perseus అనగా పరశయ్య అనియు నామములుండెనట. ఈ Perseus బొమ్మచేతిలో తానపుడే సంహరించితెచ్చిన రాక్షసుని శిరము ఉండెనట! ఆ శిరమునుండి రక్తము కారుచున్నట్లుకూడ బొమ్మలో చూపబడినదట! ఈ నక్షత్రముల గుంపులు హిందూ నక్షత్రపటములలో స్పష్టముగా చూపబడెనట! "Probably both Indian and Greek constellation figures were derived from a much older source" అనగా "హిందువుల యొక్కయు, గ్రీకులయొక్కయు నక్షత్రపటములకు మూలములైన రూపములు ప్రాచీనతరమైన ఒక్క మూలమునుండియె బహుశా రచింపబడియుండు"నని ప్రాక్టరు దొరగారు సమాధానము చెప్పుకొనుచున్నారు. కాని ఈ నక్షత్రచర్చమధ్య నొక చరిత్రాంశమును గూర్చి వ్రాయుచున్నందులకు పాఠకులు నన్ను క్షమింతురుగాక. మగధదేశమునందలి రాజగృహప్రాంతములవారును, పలాశదేశమనగా బీహారు ప్రాంతములవారును, రాజకీయ, సాంఘిక ప్రాతికూల్యముచేత హిందూదేశమును విడిచిపోవలసివచ్చెననియు, పలాశులే పెలాస్గీ (Pelasgi) జాతిగాను, గృహకులే గ్రీకులు (Greeks) గాను వ్యవహరింపబడిరనియు, వీరే గ్రీసుదేశ ప్రాంతములకు వలసబోయిరనియు, నీమొదలగు సంగతులతో 'India in Greece" అను గ్రంథమును వ్రాసి Edward Pococke అను నాంగ్లపండితుడు 1852 సంవత్సరములో ప్రకటించియున్నాడు. ఇందునుగూర్చి భాషాసామాన్యధర్మము లేగాక నైసర్గికస్వరూపములు, పర్వతనదీనదములోనగు సాక్ష్యమును సాంతముగా చర్చించి యాపండితుడు హిందువులే గ్రీసుప్రాంతములకు వలసబోయి తమ శిల్పవిజ్ఞాన నాగరకతల నచట సంస్థాపించిరని సిద్ధాంతము చేసియున్నాడు. మన వేద బ్రాహ్మణములందలి గాథలు, పురాణగాథలును, స్వల్ప-మార్పులతో గ్రీకుల విజ్ఞాన వాఙ్మయములందు ప్రతిబింబితములగుచున్నవి. ఈ విజ్ఞానమే గ్రీకు, రోమక వాఙ్మయములద్వారా నేటి పాశ్చాత్యుల కబ్బినది. ఆ విజ్ఞానమంతయు తమ పైతృకమయినట్లును మన కనుగ్రహింపబడుచున్నట్లును నేటి పాశ్చాత్యులు కొందర భినయించుచున్నారు. ఆ గ్రీకు, లాటిను,

ఇంగ్లీషు పదములకు సంస్కృతరూపములతో తద్భవముల నేర్పరచి మన కంటగట్టుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. రాజకీయ పరాధీనతకంటె యీ విజ్ఞాన పరాధీనత మనకు ప్రాణసంకటముగానున్నది. మన ప్రత్తి పరదేశముల కెగుమతియై, వస్త్రముగా నేర్పడి మనకు దిగుమతియగుచున్నట్లే మన ప్రాచీనవిజ్ఞానమును మనలను భ్రమపెట్టుటకు రూపాంతరప్రాప్తినొంది, క్రొత్తసరుకు లాగున మన కంటగట్టబడుచున్నది. పైని వివరింపబడినట్లు Cephens = కప్రూజ; Andromeda అంతర్మద మొదలగు వ్యక్తులుగాని, నామములుగాని, నేనెఱిగినంతవఱకు వేదశాస్త్రపురాణాదులలో నాకగపడలేదు. ఉన్నవని ఎవరైన సప్రమాణముగా చూపినపక్షమున శిరసావహింతును. ఖగోళచిత్రమును రచించిన కాళీనాథముఖర్జీగారు Andromeda కు ధ్రువమంతయనియు, Casseopea కు కశ్యపీయమండలమనియు, Triangulum కు ఉత్తర త్రికోణమండలమనియు Cephens కు శేఫాలిమండలమనియు నామకరణము కావించినారు. కప్రూజ శేఫాలి మొదలగు పేళ్లు చూడగా, పాశ్చాత్యులకు పంచెగట్టించి, నామములు పెట్టి, హైందవమత మిప్పించినట్లు నాకు పొడగట్టుచున్నది. కాని స్వాభావికముగా కన్పట్టకున్నది.

ఇక నీ తారలను గూర్చి నాకు తోచినది నేను మనవి చేయుచున్నాను. మన మీసందర్భమున నొకమారు భారతమందలి భృగువంశవర్ణనము గమనింతము:

ఆది-3. 68, 69. బ్రహ్మహృదయమున భృగుండు పుట్టె...భృగునకు చ్యవనుడు, చ్యవనునకౌర్వుడు, ఔర్వునకు ఋచికుడు, ఋచికునకు జమదగ్ని, జమదగ్నికి పరశురాముడు...మఱియు భారతము ప్రథమపర్వప్రథమాశ్వాసమునందున్న భృగుపత్ని చరిత్రము కూడ చూతము:—

ఆది. 1-128. భృగుడను విప్రుడు. పులోమ యతని ధర్మపత్ని. అతడొకనాడు తన ధర్మపత్ని నగ్నిహోత్ర గృహమున నుండ నియమించి తాను స్నానార్థ మరిగెను. అపుడచటికి పులోముడను వింతరక్కసుడు వచ్చి, అగ్నిహోత్రుని చూచి "అగ్ని దేవుడా? ఈమె యెవరు?" అని ప్రశ్నచేసెను. అగ్ని మిక్కిలి భయపడెను. "నిజముచెప్పిన నీరక్కసుడేమి చేయునో? అబద్ధము చెప్పుట పాపము." అని చింతించి, అబద్ధమాడనేరక "ఇది పులోమ-భృగుపత్ని" అని నిజముచెప్పివేసెను. "ఐతే ఇది నా మొదటిభార్య, భృగుడు నా తరువాత దీనిని పెండ్లాడినాడు." అనుచు వరాహరూపమున "నా సాధ్వినతిసాధ్వసచిత్త నెత్తుకొని పఱ్వంబఱ్వ దద్గర్భంబున నున్న యర్భకుండు కరంబలిగి కుక్షిచ్యుతుండై చ్యవనుండు నాబఱగె. చ్యవనుని కోపదృష్టులచేత నారక్కసుడు భస్మమయ్యెను. కులవర్ధనుడగు తన కొడుకును ఎత్తుకొని పులోమ నిజాశ్రమమున కరిగెను. రక్కసునకు వెఱచి యక్కోమలి సుందర యేడ్చుచు బోయిన తద్బాష్పధారా ప్రవాహము మహానదియై తదాశ్రమసమీపమున బాఱిన దానికి లోకపితామహుండు వధూసరయను నామంబుచేసె." ఈవృత్తాంతము విని తన పత్ని కలరూపుచెప్పినవా డగ్నియని కోపించి భృగుడు అగ్నిని 'సర్వభక్షకుడవు కమ్మ'ని శపించెను. అగ్ని తన మూర్తి సంహరించెను. లోకములు తల్లడిల్లెను. 'సర్వభక్షకుడవయ్యు నీవు పరమ శుచిమూర్తి'వని బ్రహ్మ అగ్నికి వరమిచ్చెను. అగ్ని మరల ప్రకాశించెను. లోకము లుల్లసిల్లెను.

ఈ కథకును మన నక్షత్రపటమునకును సంబంధము చిత్తగింపుడు. ఉత్తరాభాద్ర నక్షత్రమునకు అధిదేవత అహిబుధ్న్యః. (చూ: నక్షత్రఇష్టి: కృష్ణయజుర్వేదము. ప్రోష్ఠపదానక్షత్రం, అహిర్బుధ్న్యో దేవతా.) గార్హపత్యాగ్నికి దీనితో సంబంధమున్నది. (చూడుడు. ఐతరేయబ్రాహ్మణ III. 3. 36):—

"తాసువా అహినాబుధ్న్యేన పరోక్షాత్తేజోదధాదేషహవా అహిర్బుధ్న్యోయ దగ్నిర్గార్హ పత్యో గ్నినైవాసుతద్గార్హపత్యేన పరోక్షాత్తేజోదధాతి"

ప్రజాపతి (జంతుసృష్టి కావించిన పిదప ఉదకము జల్లి) అహిబుధ్న్యునిద్వారా వానికొక కాంతి ప్రసాదించెను. ఈ అహిబుధ్న్యుడే గార్హపత్యాగ్ని. కాబట్టి ఈ

ఉత్తరాభాద్ర గార్హపత్యాగ్నియని తెలియగలదు. దీనికి కాపుగా తన పత్ని నక్కడనుంచి భృగుడు పైకి పోయెను. అప్పుడే రక్కసు డొకడువచ్చి గర్భిణియై యున్న ఆమెను నిర్బంధించి తీసుకొనిపోయెను. ఆ రక్కసు డెవడాయని మనము దూరముగా వెతుకుచు బోవ నక్కర లేదు. వానిని పాశ్చాత్యులు Algol అని పిలుచుచు న్నారు. అరబ్బీభాషలో Algol అనగా గ్రుడ్లు మిటకరించు రాక్షసుడని యర్థము. ఈ నక్షత్ర స్వభావము చాల విచిత్రమైనది. ఇది యొకప్పుడు మంచికాంతి గలిగియుండును. స్వల్పకాలములో నీకాంతి తరిగిపోవును. మరల కాంతి హెచ్చుచుండును. ఇట్లు కాంతి తగ్గుచు హెచ్చుచుండుటచేత నీ చుక్క గ్రుడ్లు మిటకరించు రక్కసుడని చెప్పుట సహజము. ఈ రక్కసునిచేత పీడింపబడి భృగుపత్నికి గర్భపాత మయ్యెను. చ్యవనుడు జన్మించెను. మాతృగర్భచ్యుతుడగు చ్యవనుడే పాశ్చాత్యులచే Triangulum అని వ్యవహరింపబడుచున్నాడు. ఈచ్యవనునికి అశ్వినులతో చాల సంబంధమున్నట్లు వేద గాథలున్నవి. అశ్వినీదేవతలను గూర్చినగాథలు ప్రశంసించునపుడు వానిని గూర్చి వివరముగా చర్చింతము.

చ్యవనుడు ముఖ్యముగా ఇంద్ర మదహర్త. అధికార మదముచే ఇంద్రుడు చ్యవను నధిక్షేపింపగా, చ్యవనుడు వజ్రహస్తుని హస్తము స్తంభింపజేసి, మదరాక్షసుని పుట్టించి ఇంద్రుని మదమడచెను. (మా. ఆరణ్య. ౩—182 -197) కావున చ్యవనునికి ఇంద్ర మదాపహర్తయని ప్రఖ్యాతిగలిగెను. ఇతని తల్లికి ఇంద్ర మదాపహర్త మాతయని పేరు వచ్చుట సహజము. కాలక్రమమున నీనామమునందలి అపహర్త-మాత-అనుపదములు జారిపోగా ఇంద్రమద మాత్రము మిగిలినది. ఇదే ఏంద్రామిడాయను నామమున పాశ్చాత్యులచే వ్యవహరింపబడుచున్నది.

చ్యవనుడు భృగు కుల సంజాతుడని చెప్పియుంటిమి. భృగుడు బ్రహ్మ హృదయ సంజాతుడని కూడ తెల్పితిమి. ఈ బ్రహ్మహృదయనక్షత్రము Capella అని పాశ్చాత్యులచే వ్యవహరింపబడుచున్నది. కాలుచున్న మెగ్నీశియము తీగవలె బహుధవళకాంతితో తేజరిల్లు నీనక్షత్ర రాజము ఈనెల తొలిజామున నగపడదు. కార్తికమాసములో కనబడును. కావున నీనక్షత్ర సమూహములను, ఈపటములో మిగిలిన నక్షత్రములను, గుఱించి కార్తికమాస సంచికలో ప్రశంసింతము.